# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక :07 22-07- 2026 బుధవారం పేజీలు: 4 వెల:03/-



తెలంగాణ వెన్నెల వాక్కు

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం

7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో


# వన మహోత్సవంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరేనా?

## ఆర్భాటపు ఆరంభాలు.. అంతలోనే అంతర్ధానాలు!

నిర్మల్ జూలై 20 తెలంగాణ వెన్నెల వాక్కు

పర్యావరణ సమతుల్యతను కాపాడటం, అడవుల శాతాన్ని పెంచడం, భావితరాలకు పచ్చని పరిసరాలను అందించడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతి ఏటా ప్రతిష్టాత్మకంగా 'తెలంగాణకు హరితహారం' (వన మహోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. నిర్మల్ జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది కూడా అటవీ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మరియు స్థానిక మున్సిపాలిటీల ఆధ్వర్యంలో లక్షలాది మొక్కలను నాటేందుకు భారీ లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. జిల్లాలోని పద్దెనిమిది గ్రామీణ మండలాల పరిధిలో ఉన్న 396 గ్రామ పంచాయతీల్లో కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని వెచ్చించి నర్సరీలను ఏర్పాటు చేశారు. గతంలో ఈ 396 నర్సరీల్లో 39.60 లక్షల మొక్కలు పెంచగా, వాటిని హరితహారం అవసరాలకు విజయవంతంగా వినియోగించారు. అయితే ఈసారి అధికారులు మరింత భారీ లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు. 2024 లక్ష్యాల ప్రకారం జిల్లావ్యాప్తంగా మొత్తం 51.48 లక్షల మొక్కల పెంపకం లక్ష్యంగా నిర్ణయించి, ఆ మేరకు నర్సరీలలో మొక్కలను సిద్ధం చేశారు. కానీ, ఈ ఆర్భాటపు ఆరంభాలు, అంకెలాటల వెనుక ఉన్న అసలు క్షేత్రస్థాయి వాస్తవాలు పరిశీలిస్తే భిన్నమైన పరిస్థితి గోచరిస్తోంది. ప్రతి సంవత్సరం కోట్ల రూపాయలు ఖర్చు చేసి నాటుతున్న మొక్కలలో సగం కూడా బతకకపోవడంతో, ప్రభుత్వ అసలు లక్ష్యం నెరవేరేనా? లేక నిధులన్నీ బూడిదలో పోసిన పన్నీరేనా? అనే బలమైన ప్రశ్నలు పర్యావరణవేత్తల నుండి వెల్లువెత్తుతున్నాయి.

జిల్లాలోని 396 గ్రామ పంచాయతీ నర్సరీలలో ఈ ఏడాది మండలాల వారీగా పెంపకం లక్ష్యాలను కేటాయించారు. ఇందులో భాగంగా అత్యధికంగా కుబీర్ మండలంలో 5,33,000 మొక్కలు, సారంగాపూర్‌లో 4,16,000 మొక్కలు, తానూర్‌లో 4,03,000 మొక్కలు, భైంసాలో 3,90,000 మొక్కలు, కడెంలో 3,64,000 మొక్కలు, మామడలో 3,51,000 మొక్కలు పెంచుతున్నారు. అలాగే లోకేశ్వరంలో 3,25,000 మొక్కలు, ఖానాపూర్ మరియు పెంబి మండలాల్లో చెరి 3,12,000 మొక్కలు, నిర్మల్ మండలంలో 2,60,000 మొక్కలు, ముధోల్‌లో 2,47,000 మొక్కలు, లక్ష్మణచందాలో 2,34,000 మొక్కలు, కుంటాలలో 1,95,000 మొక్కలు, సోన్‌లో 1,82,000 మొక్కలు, దస్తూరాబాద్ మరియు నర్సాపూర్ (జి) మండలాల్లో చెరి 1,69,000 మొక్కలు, దిలావర్‌పూర్‌లో 1,56,000 మొక్కలు మరియు బాసర మండలంలో 1,30,000 మొక్కల పెంపకాన్ని లక్ష్యంగా పెట్టుకున్నారు.




హరితహారం కింద అవెన్యూ ప్లాంటేషన్, కమ్యూనిటీ ప్రాంతాలు, చెరువు కట్టలు, సంస్థాగత ప్రాంగణాలు, మరియు హరితవనాలు తదితర ప్రాంతాల్లో ఈ మొక్కలను నాటుతున్నారు. అయితే, మొక్కలు నాటడంపై చూపిస్తున్న శ్రద్ధ.. వాటి రక్షణపై చూపించడం లేదనే ఆరోపణలు స్పష్టంగా వినిపిస్తున్నాయి. నాటడమే పరమావధిగా అధికారులు టార్గెట్ల వెనుక పరుగులు పెడుతున్నారు. విచ్చలవిడిగా మొక్కలు నాటడం వల్ల వాటికి కనీస రక్షణ కరువవుతోంది. నాటిన మొక్కలకు ట్రీ-గార్డులు లేదా ఫెన్సింగ్‌లు ఏర్పాటు చేయకపోవడం వల్ల, అవి పశువుల పాలవుతున్నాయి. ముఖ్యంగా రోడ్ల పక్కన, చెరువు కట్టలపై ఆడంబరంగా నాటిన మొక్కలు కొద్దిరోజులకే పశువుల మేతగా మారిపోతున్నాయి. సంరక్షణ బాధ్యతలు తీసుకోవడానికి కాంట్రాక్టర్లు గానీ, స్థానిక ఏజెన్సీలు గానీ ముందుకు రాకపోవడం ఈ పథకానికి పెద్ద శాపంగా మారింది. వర్షాకాలంలో అట్టహాసంగా మొక్కలు నాటి చేతులు దులుపుకునే అధికారులు, ఆ తర్వాత వాటిని పట్టించుకోవడం పూర్తిగా వదిలేస్తున్నారు. వర్షాలు తగ్గిపోయిన తర్వాత, ముఖ్యంగా వేసవి కాలంలో ఈ మొక్కలకు నీరు పోసేందుకు సరైన ట్యాంకర్ల సౌకర్యం లేకపోవడంతో వేల సంఖ్యలో మొక్కలు ఆదిలోనే ఎండిపోతున్నాయి. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత సాకుతో మొక్కల నీటి సరఫరాను గాలికి వదిలేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో లక్ష్యం మేరకు మొక్కలు నాటడమే తప్ప, వాటిని బతికించడం తమ బాధ్యత కాదన్నట్లుగా స్థానిక యంత్రాంగం వ్యవహరిస్తోంది. గ్రీన్ బడ్జెట్ నిధులు కేటాయిస్తున్నామని చెప్తున్నప్పటికీ, అవి కాగితాలకే పరిమితమవుతున్నాయి కానీ మొక్కల దాహం తీర్చడానికి ఉపయోగపడటం లేదనే విమర్శలు ఉన్నాయి.

ప్రతి ఏటా ఎంత ఖర్చు పెట్టారు, ఎన్ని లక్షల మొక్కలు నాటారనే రికార్డులు అధికారుల వద్ద సిద్ధంగా ఉంటున్నాయే తప్ప, గత ఏటా నాటిన వాటిలో ఎన్ని బతికాయనే కనీస పర్యవేక్షణ కరువైంది. సర్వైవల్ రేట్ పై క్షేత్రస్థాయిలో ఎలాంటి సామాజిక తనిఖీ జరగడం లేదు. సంస్థాగత ప్రాంగణాల్లో నాటిన కొన్ని మొక్కలు మినహా, బహిరంగ ప్రదేశాల్లో నాటినవి సంరక్షణ కరువై అంతర్ధానమవుతున్నాయి. నిర్మల్ జిల్లా ప్రత్యేకత అయిన కొయ్యబొమ్మల పరిశ్రమకు ఆసరాగా నిలిచే 'పొనికి చెట్ల' పెంపకం వంటి ప్రతిష్టాత్మక ప్రయోగాలు కూడా సరైన పర్యవేక్షణ, నిర్వహణ లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు.

ఈ ఏడాది కూడా వర్షాకాలం ప్రారంభంలో వర్షాలు ఆలస్యం కావడంతో వన మహోత్సవ కార్యక్రమం ఇప్పటికే వెనుకబడింది. అర్బన్ బయోడైవర్సిటీ, అటవీ శాఖ అధికారులు స్థానిక సంక్షేమ సంఘాలను, స్వచ్ఛంద సంస్థలను భాగస్వామ్యం చేస్తామని ప్రకటనలు గుప్పిస్తున్నప్పటికీ, గతానుభవాలను చూస్తే ఆచరణలో అది ఎంతవరకు సాధ్యమనేది శేషప్రశ్నగానే మిగిలింది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం కేవలం 51.48 లక్షల లక్ష్యాల టార్గెట్లను రీచ్ అవ్వడం కోసమే కాకుండా, నాటిన ప్రతి మొక్కను రక్షించేలా పక్కా ప్రణాళికలు, రక్షణ చర్యలు తీసుకోకపోతే ఈ ఏడాది కూడా వన మహోత్సవం ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టే మరో విఫల ప్రయోగంగానే మిగిలిపోనుందని పర్యావరణవేత్తలు, జిల్లా ప్రజలు హెచ్చరిస్తున్నారు.

# ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తత: ప్రధాని నివాసం ముట్టడికి కాంగ్రెస్ యత్నం..

## కేంద్రం ముందు ఐదు కీలక డిమాండ్లు!



ఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తంగా మారింది. కేంద్ర ప్రభుత్వ విధానాలు, నిర్ణయాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఆందోళన కార్యక్రమాలు జాతీయ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. ప్రధానమంత్రి నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు, వేలాది మంది కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావడంతో రాజధాని వీధుల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ, ప్రధాని నరేంద్ర మోడీ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలంటూ కాంగ్రెస్ శ్రేణులు హోరెత్తించాయి. పోలీసులు రంగంలోకి దిగి ఆందోళనకారులను అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు తీవ్రరూపం దాల్చాయి.

?కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ భారీ ధర్నా కార్యక్రమానికి పార్టీ అగ్రనేతలు, పార్లమెంట్ సభ్యులు, వివిధ రాష్ట్రాల ముఖ్య నాయకులు, పదాధికారులు మరియు కార్యకర్తలు విపరీతంగా హాజరయ్యారు. ప్రధాని నివాసానికి వెళ్లే అన్ని ప్రధాన రహదారులను పోలీసులు బహుళ అంచెల బారికేడ్లతో మూసివేసినప్పటికీ, కాంగ్రెస్ శ్రేణులు వాటిని తోసుకుని ముందుకు వెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. ఈ క్రమంలో నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య తీవ్ర స్థాయిలో నెట్టివేతలు చోటుచేసుకున్నాయి. ప్రధాని మోడీ వెంటనే రాజీనామా చేయాలనే డిమాండ్‌తో పాటు కేంద్ర వైఖరిని ఎండగడుతూ కాంగ్రెస్ నేతలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ అనుకోని పరిణామంతో ప్రధాని నివాస ప్రాంతంలో, పరిసర వర్గాల్లో పోలీసులు భారీగా బలగాలను మోహరించారు. ఢిల్లీ వ్యాప్తంగా ప్రధాన కూడళ్లలో భద్రతను అత్యంత పటిష్టం చేశారు.

ఒకవైపు రహదారులపై నిరసనలు, ధర్నాలు తీవ్రరూపం దాల్చగా, మరొకవైపు ఈ రాజకీయోత్సవాన్ని శాంతింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం తరఫున రాయబార చర్చల ప్రక్రియ కూడా వేగంగా ప్రారంభమైంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ అత్యవసరంగా సమావేశమై చర్చలు జరిపారు. ఈ చర్చల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వం ముందు ఐదు కీలక డిమాండ్లను ఉంచినట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలుస్తోంది. దేశంలో ప్రస్తుతం నెలకొన్న క్లిష్ట పరిస్థితులు, ప్రజా సమస్యలు, ప్రతిపక్షాల ఆందోళనలకు సంబంధించి ఆ ఐదు డిమాండ్లను చాలా స్పష్టంగా కేంద్ర మంత్రికి రాహుల్ గాంధీ వివరించినట్లు సమాచారం.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ముందు ఉంచిన ఈ ఐదు డిమాండ్ల నివేదిక తక్షణమే కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వద్దకు చేరింది. ఢిల్లీలో నిమిషనిమిషానికి చోటుచేసుకుంటున్న ఉద్రిక్త పరిణామాలు, ప్రధాని నివాసం ఎదుట జరుగుతున్న భారీ ఆందోళనలు, కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన కీలక డిమాండ్లపై హోంశాఖ అత్యున్నత స్థాయిలో దృష్టి సారించింది. పరిస్థితి శాంతిభద్రతల పరంగా చెయ్యిదాటిపోకుండా చూసేందుకు, అలాగే కాంగ్రెస్ లేవనెత్తిన డిమాండ్లపై ప్రభుత్వం వైపు నుంచి ఎలాంటి నిర్ణయం తీసుకోవాలనే దానిపై అమిత్ షా ఉన్నతాధికారులతో, కీలక మంత్రులతో అత్యవసర సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిసింది. ప్రధానమంత్రి నివాసం వద్ద భద్రతా చర్యలను కేంద్ర హోంశాఖ నేరుగా పర్యవేక్షిస్తోంది.

ప్రధానమంత్రి రాజీనామా చేయాలనే పట్టుదలతో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ

2

# హైదరాబాద్‌కు తాకిన విద్యార్థుల ఆందోళన:

## లోక్‌భవన్ ముట్టడికి యత్నం.. పోలీసుల అడ్డుకోత, ఈడ్చివేత!



హైదరాబాద్ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలో విద్యార్థులు, యువతపై పోలీసులు జరిపిన లాఠీచార్జ్ నిరసన సెగలు ఇప్పుడు తెలంగాణ రాజధాని హైదరాబాద్‌కు తాకాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సాగుతున్న విద్యార్థి ఉద్యమానికి సంపూర్ణ సంఘీభావం తెలుపుతూ, అలాగే నీట్ (చీజుజు) పరీక్షల్లో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఎస్‌ఎఫ్ఐ (ాఖీ×), ఏఐఎస్ఎఫ్ (ూ×ాఖీ), పీడీఎస్‌యూ (ాణూఖ), ఏఐఎఫ్‌డీఎస్ (ూ×ఖీణూ) సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన 'ఛలో లోక్‌భవన్' పిలుపు హైదరాబాద్‌లో తీవ్ర రాజకీయ దుమారాన్ని, ఉద్రిక్తతను రేపింది.

ఈ ముట్టడి కార్యక్రమంలో భాగంగా విద్యార్థి సంఘాల నాయకులు, కార్యకర్తలు, పలువురు యువకులు పెద్దఎత్తున ఖైరతాబాద్ సిగ్నల్ వద్దకు చేరుకున్నారు. అక్కడ నుంచి

2

# ఎన్నికల కోసమే కాంగ్రెస్ కొత్త నాటకం:

## ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారంపై బీజేపీ ఆగ్రహం



హైదరాబాద్ బ్యూరో

రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (+ఎవీజ) ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనాలు పొందేందుకే రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇందిరమ్మ ఇండ్ల' పేరిట కొత్త నాటకానికి తెరతీసిందని బీజేపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ ఎన్. రామచందర్ రావు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. నాటి ఎన్నికల ప్రచారంలో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని రంగుల కలలు చూపించిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూడటం వారి ద్వంద్వ విధానాలకు నిదర్శనమని ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని ప్రజా సంక్షేమం కోసం కాకుండా కేవలం ఓటు బ్యాంక్ రాజకీయం కోసమే వాడుకుంటోందని ఆరోపించారు.

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, అధికారంలోకి వచ్చాక అమలు చేస్తున్న నిర్ణయాలకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉందని రామచందర్ రావు విమర్శించారు. నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేస్తామని చెప్పి, ఇప్పుడు లబ్ధిదారులపై అదనపు ఆర్థిక భారం మోపడం ప్రజలను నిలువునా మోసం చేయడమేనని ఆయన మండిపడ్డారు. ఉచితంగా ఇల్లు ఇస్తామని చెప్పి ఇప్పుడు వివిధ రకాల చెల్లింపులు

2

తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# ఇందిరమ్మ ఇండ్ల రెండో జాడేది?

## పేదల ఆశలపై నిబంధనల ఉచ్చు!

'కాంగ్రెస్ అంటే పేదల పార్టీ.. హస్తం గుర్తు అధికారంలోకి వస్తే పేదవాడి సొంతింటి కల నెరవేరుతుంది'---గత శాసనసభ ఎన్నికల ప్రచారంలో లంకె బిందెల వంటి హామీలతో అధికార పీఠాన్ని అధిరోహించిన కాంగ్రెస్ ప్రభుత్వం, క్షేత్రస్థాయికి వచ్చేసరికి మాట తప్పుతోందా? అర్హులైన పేదలకు గూడు కల్పించడంలో చూపిస్తున్న అలసత్వం, విధిస్తున్న వింత నిబంధనలు చూస్తుంటే సామాన్యుడికి ఇదే అనుమానం కలుగుతోంది. ముఖ్యంగా ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతపై గంపెడాశలు పెట్టుకున్న నిరుపేదల ఆశలు అడియాసలవుతున్న తీరు, క్షేత్రస్థాయిలో పాలనాపరమైన లోపాలకు అద్దం పడుతోంది. ఎన్నికల సమయంలో ఒకలా మాట్లాడి, అధికారంలోకి వచ్చాక మరోలా నిబంధనలు తెరపైకి తీసుకురావడం పేదలను మోసగించడమే అవుతుంది.



**గడ్డి గుడిసెలు ఉంటేనే ఇల్లా? ఇది ఎక్కడి న్యాయం!**

రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు పెడుతున్న నిబంధనలు విస్మయానికి గురిచేస్తున్నాయి. క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్న సిబ్బంది 'గడ్డి కుడిసెలు' ఉంటేనే ఇల్లు మంజూరు చేస్తామని మొండికేస్తుండటం ఏ రకమైన సంక్షేమ నమూనా? 1970వ దశకంలో ఇందిరా గాంధీ హయాంలోనో, ఆ తర్వాతో ఇచ్చిన ఇండ్లు నేడు పూర్తిగా శిథిలమై, కూలిపోయే స్థితికి చేరినప్పటికీ... "అక్కడ పాత ఇల్లు ఉంది కదా, కొత్తది ఇవ్వడానికి వీల్లేదు" అనడం ఏ రకమైన నీతి? మొదటి విడతలో ఇప్పటికే ఇండ్లు ఉన్నవారికే రాజకీయ పైరవీలతో, అర్హతలతో సంబంధం లేకుండా ఎంపిక చేసి ఇచ్చారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న తరుణంలో.. ఇప్పుడు నిజమైన పేదవాడిని నిబంధనల పేరుతో దూరం పెట్టడం ఎంతవరకు సమంజసం? నిలువ నీడ లేని నిరుపేదలు ఇల్లు కావాలంటే మళ్లీ గుడిసెలు వేసుకుని నిరూపించుకోవాలా? అని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలానికి తగినట్లుగా మారుతున్న జీవన ప్రమాణాలను గుర్తించకుండా, నాటి కాలపు గడ్డి గుడిసెల నిబంధనలను అడ్డుపెట్టడం దారుణం.

**పేదల పార్టీయా... ధనికుల కొమ్ముకాసే ప్రభుత్వమా?**

చరిత్ర పొడవునా కాంగ్రెస్ పార్టీ పేదల పక్షాన నిలిచిందని చెప్పుకునే నాయకులు, నేడు క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఈ అన్యాయాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదు? ప్రభుత్వ తీరు చూస్తుంటే ఇది పేదల పార్టీనా లేక ధనికుల పార్టీగా మారిందా? అనే సందేహాలు ప్రజల్లో బలంగా వేళ్లూనుకుంటున్నాయి. సంక్షేమ పథకాల అమలులో ఇలాంటి కొర్రీలు పెడితే, కాంగ్రెస్ పార్టీపై జనం నమ్మకం వదులుకోవడం ఖాయం. ఈ ప్రజా వ్యతిరేక విధానాలు ఇలాగే కొనసాగితే, రాబోయే స్థానిక సంస్థల (గ్రాజ, వీూజ) ఎన్నికల్లో పాలక పక్ష నాయకులు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారు? కనీసం డిపాజిట్లు అయినా దక్కుతాయా? అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇప్పటికే క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కార్యకర్తలు 'మూడు ముక్కలాట'గా చీలిపోయి, అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతుంటే, ప్రజాక్షేత్రంలో ఇందిరమ్మ ఇండ్ల వైఫల్యం పార్టీకి మరింత పెను ముగంపుగా మారే ప్రమాదం ఉంది.

**అధికారుల లోపమా? పాలకుల పట్టింపులేమియా?**

ఈ విపరీతమైన గందరగోళానికి పాలకుల వైఫల్యమా లేక అధికారుల ఉదాసీనతా? ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకు, క్షేత్రస్థాయిలో అధికారులు అమలు చేస్తున్న విధివిధానాలకు పొంతన లేకుండా పోయింది. ఇండ్ల ఎంపిక ప్రక్రియను కేవలం గ్రామ కార్యదర్శుల స్థాయి సిబ్బందికే వదిలేసి చేతులు దులుపుకుంటున్నారా? స్థానికంగా ఉన్న జిల్లా కలెక్టర్లు ఈ వ్యవహారాన్ని బాధ్యతాయుతంగా పర్యవేక్షించడం లేదా? అనే తీవ్రమైన ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. కలెక్టర్లు, యంత్రాంగం నిరుపేదల కష్టాలను గుర్తించి క్షేత్రస్థాయిలో నిజమైన అర్హులను ఏరివేయడంలో విఫలమవుతున్నారు. ముఖ్యమంత్రి ఒక మాట చెబితే, అధికారులు క్షేత్రస్థాయిలో మరోలా వ్యవహరిస్తూ పేదల ఉసురు పోసుకుంటున్నారు. ప్రజా సమస్యలపై స్పందించాల్సిన యంత్రాంగం నిబంధనల పేరిట కాలయాపన చేయడం సరికాదు.

**నిర్మల్ జిల్లా నుంచి రాష్ట్రస్థాయి వరకు నిరుపేదల గోడు**

ఇది కేవలం ఒక నిర్మల్ జిల్లా కథ మాత్రమే కాదు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అటకెక్కిన ఇందిరమ్మ ఇండ్ల ఆశావహుల హృదయవేదన. అర్హులను పారదర్శకంగా గుర్తించడంలో యంత్రాంగం విఫలమై, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించి, నిబంధనల ఉచ్చుతో పేదలను వేధిస్తే కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించుకోక తప్పదు. పేదల కడుపు కొట్టి, వారి సొంతింటి కలలను సమాధి చేస్తూ పోతే... రాబోయే రోజుల్లో ప్రజలు తగిన తద్ధకం చెబుతారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్ళు తెరిచి, వింత నిబంధనలను తక్షణమే పక్కనబెట్టి, కలెక్టర్ల ప్రత్యక్ష పర్యవేక్షణలో పారదర్శకమైన సర్వే జరిపించాలి. నిజమైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించి వారి శాపనార్థాల నుంచి విముక్తి పొందాలని ప్రజలు కోరుకుంటున్నారు. లేనియెడల ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదు.



వెంక గారి భూమయ్య
సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863

# నిర్మల్ బిజెపిలో భగ్గుమంటున్న అంతర్గత విభేదాలు

## వలస నాయకుల ఆధిపత్యంపై సీనియర్ల తిరుగుబాట జెండా

## కషాయ వర్గాల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తి జ్వాలలు

నిర్మల్ జూలై 21 తెలంగాణ వెన్నెల వాక్కు

నిర్మల్ జిల్లా భారతీయ జనతా పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయి. నిన్నటివరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు ఇప్పుడు బహిరంగ వివాదాలకు దారితీస్తోంది. సుదీర్ఘకాలంగా పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని, ప్రతి కార్యక్రమానికి వెన్నంటి ఉంటూ జెండా మోసిన సీనియర్ నాయకులు, కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతోందనే గుసగుసలు జిల్లా వ్యాప్తంగా వినిపిస్తున్నాయి. రాబోయే జడ్పిటిసి, ఎంపిటిసి స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈ అంతర్గత పూచిక పుల్ల రచ్చకెక్కడం పార్టీ భవిష్యత్తుపై పలు అనుమానాలు రేకెత్తిస్తోంది. క్రమశిక్షణకు, స్పష్టమైన సిద్ధాంతాలకు పెద్దపీట వేసే బిజెపిలో ప్రస్తుతం రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయనే చర్చ కషాయ వర్గాల్లో తీవ్రంగా నడుస్తోంది.

**కష్టపడిన శ్రేణులకు విస్మరణ.. వలస నేతలకే ప్రాధాన్యం**

పార్టీ కష్టకాలంలో ఉన్నప్పటి నుంచి అనేక కేసులు, గొడవలు ఎదుర్కొంటూ క్షేత్రస్థాయిలో బిజెపి బలోపేతానికి రక్తం ధారపోసిన అసలైన నాయకులను పూర్తిగా పక్కనబెడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల కాలంలో కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన వలస నాయకులకే జిల్లాలో అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అగ్రపీఠం కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని సీనియర్ నేతలు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. నిజంగా పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి వ్యవహరించే వ్యక్తులను విస్మరించి, నిన్నగాక మొన్న చేరిన వారికి కీలక పదవులు ఇచ్చి నెత్తిన పెట్టుకోవడం వల్ల అసలైన కషాయ కార్యకర్తల మనోభావాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని స్థానిక శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

**నాయకత్వ శైలిపై తిరుగుబాట.. జిల్లా అధ్యక్షుడి మార్పునకు డిమాండ్**

జిల్లా పరిధిలోని పార్టీ వ్యవహారాలు, నిర్ణయాల పట్ల సామాన్య కార్యకర్తల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. నియోజకవర్గ నాయకత్వం, స్థానిక ఎమ్మెల్యే వ్యవహార శైలిపై కార్యకర్తలు లోలోపలే తీవ్ర ఆగ్రహంతో కుంగిపోతున్నారని, ?ంత పార్టీ శ్రేణుల అభిప్రాయాలకు ఎలాంటి విలువా ఇవ్వడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికితోడు జిల్లా బిజెపి అధ్యక్షుడిని వెంటనే మార్చాలనే డిమాండ్ కూడా సీనియర్ వర్గాల నుంచి గట్టిగా వినిపిస్తోంది. ఏకాధిపత్య ధోరణితో వ్యవహరిస్తూ నేను చెప్పిందే వేదం అనే రీతిలో నిర్ణయాలు తీసుకోవడం వల్ల ఎంతోకాలంగా సేవలు అందిస్తున్న సీనియర్ నేతలు తీవ్ర అవమాన భారంతో రగిలిపోతున్నారు.




**స్థానిక ఎన్నికల ముంగిట పార్టీకి తప్పని ప్రక్షాళన ముప్పు**

ప్రస్తుత పరిణామాలను గమనిస్తున్న కార్యకర్తలు అసలు నిర్మల్ జిల్లా బిజెపిలో ఏం జరుగుతోందో అర్థం కాక అయోమయంలో పడ్డారు. ఏళ్ల తరబడి జెండా మోసిన కార్యకర్తలకు గుర్తింపు లేకపోతే భవిష్యత్తులో ఎటు వెళ్లాలని వారు నిలదీస్తున్నారు. పదవులన్నీ వలసవాదులకే దక్కుతుంటే మొదటి నుండి ఉన్న శ్రేణులకు స్థానం ఎక్కడుందని ప్రశ్నిస్తున్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ వర్గ విభేదాలు పూర్తిస్థాయిలో బయటపడి పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా బిజెపి అధిష్టానం తక్షణమే జోక్యం చేసుకుని జిల్లా పార్టీలో సమగ్ర ప్రక్షాళన చేపట్టాలని, సుదీర్ఘకాలం కష్టపడిన అసలైన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఇచ్చి న్యాయం చేయాలని సీనియర్లు డిమాండ్ చేస్తున్నారు. నాయకత్వ తీరు మారకపోతే కార్యకర్తలు పార్టీకి దూరంగా ఉండటమో లేదా ఇతర ప్రత్యామ్నాయ దారులు చూసుకోవడమో తప్పదని హెచ్చరిస్తుండటంతో నిర్మల్ జిల్లా రాజకీయాల్లో ఈ అంశం తీవ్ర కలకలం రేపుతోంది.

# సారంగాపూర్ లో పూదారి అరవింద్ జన్మదిన వేడుకలు

సారంగాపూర్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ ప్రాంగణంలో సర్పంచ్ కూనేరు భూమన్న ఆధ్వర్యంలో నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ కూచాడి శ్రీహరి రావు వ్యక్తిగత సహాయకుడు (పీఏ) పూదారి అరవింద్ జన్మదిన వేడుకలను మంగళవారం కాంగ్రెస్ కార్యకర్తలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్‌లో నాయకుల సమక్షంలో అరవింద్ చేత కేక్ కట్ చేయించి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ హాది, అడెల్లి సర్పంచ్ దండు సాయన్న, వార్డు సభ్యులు పిల్లి సంతోష్, దొడ నర్సయ్య, సందీప్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



# రాహుల్ గాంధీ అరెస్టు ప్రజాస్వామ్యానికి విరుద్ధం: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి

- నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఆందోళనల్లో అరెస్టు చేయడాన్ని ఖండిస్తూ నిర్మల్ లో నిరసన
- కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల గొంతును అణచివేయొద్దని డిమాండ్



నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఢిల్లీలో జాతీయ స్థాయి నీట్ పరీక్షల అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసిన ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అకారణంగా అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి నిర్మల్ పట్టణంలో నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా సమస్యలపై నిలదీసే హక్కు ప్రతిపక్ష నాయకులకు ఉంటుందన్నారు. నిరుద్యోగ యువత, విద్యార్థుల తరఫున పార్లమెంట్ బయట గొంతెత్తిన ప్రతిపక్ష నాయకుడిని అరెస్ట్ చేయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి, ప్రజాస్వామ్య విలువల ఉల్లంఘనకు నిదర్శనమన్నారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడం సాధ్యం కాదు: కేంద్ర ప్రభుత్వం పోలీసు బలగాలను ఉపయోగించి ప్రజల, ప్రతిపక్షాల గొంతును అణచివేసే ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. పోటీ పరీక్షల నిర్వహణలో వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే ఇలాంటి అణచివేత చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న అధికారులపై, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా శాంతియుత ఆందోళనకారులపై కేసులు పెట్టడం సరికాదన్నారు. రాహుల్ గాంధీని వెంటనే బేషరతుగా విడుదల చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని అరెస్టును తీవ్రంగా ఖండించారు.

# హైదరాబాద్‌కు తాకిన విద్యార్థుల ఆందోళన:

వారు ఒక్కసారిగా లోక్‌భవన్ వైపు ఊరేగింపుగా దూసుకెళ్లేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. అయితే, అప్పటికే అక్కడ పరిస్థితులను గమనించి అప్రమత్తమైన పోలీసులు భారీగా బారికేడ్లు ఏర్పాటు చేసి విద్యార్థులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దాంతో విద్యార్థి నాయకులకు, భద్రతా బలగాలకు మధ్య తీవ్రస్థాయిలో తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. బారికేడ్లను దాటుకుని లోక్‌భవన్ వైపు చొచ్చుకెళ్లేందుకు యత్నించిన విద్యార్థులను పోలీసులు బలవంతంగా నిలువరించి, వారిని రోడ్లపై ఈడ్చిపారేస్తూ నిర్బంధించారు.

ఈ క్రమంలో ఉద్రిక్త పరిస్థితులు మరింత వేడెక్కడంతో పోలీసులు రంగంలోకి దిగి విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకుని పోలీస్ వాహనాల్లోకి ఎక్కించి సమీప పోలీస్ స్టేషన్లకు తరలించారు. పోలీసుల తోపులాట, ఈడ్చివేతల తీవ్రతకు పలువురు విద్యార్థి సంఘాల నాయకులకు, కార్యకర్తలకు గాయాలయ్యాయి. పోలీసులు విద్యార్థులను రోడ్డుపై క్రూరంగా ఈడ్చుకెళ్తున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వ్యాపించడంతో అంతటా తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమపై పోలీసులు ఇటువంటి నిర్బంధ ధోరణి ప్రదర్శించడాన్ని విద్యార్థి సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు.

ప్రజాస్వామ్యయుతంగా విద్యా హక్కులు, విద్యార్థి ప్రయోజనాల కోసం పోరాడుతున్న వారిపై కేంద్ర ప్రభుత్వం భద్రతా బలగాల ద్వారా అణచివేత చర్యలకు పాల్పడటం బ్రిటిష్ పాలనా కాలాన్ని గుర్తుచేస్తోందని నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయినా, నీట్ వంటి కీలకమైన పరీక్షల్లో అవకతవకలు జరిగి విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినా కేంద్ర ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. విద్యార్థుల రక్తం చూడటమే కేంద్ర ప్రభుత్వ విధానమా అని వారు నిలదీశారు. వెంటనే విద్యార్థులపై అక్రమ కేసులు ఎత్తివేసి, అరెస్టు చేసిన నాయకులందరినీ బేషరతుగా విడుదల చేయాలని, విద్యా రంగాన్ని కాపాడేందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. లోక్‌భవన్ ముట్టడి యత్నంతో హైదరాబాద్‌లో ప్రధాన రహదారులపై రాకపోకలు నిలిచిపోయి సాధారణ ప్రజలకు తీవ్ర అవస్థలు ఎదురయ్యాయి.

# ఎన్నికల కోసమే కాంగ్రెస్ కొత్త నాటకం:

చేయాలంటూ కండిషన్లు పెట్టడం కాంగ్రెస్ నైజానికి అద్దం పడుతోందన్నారు. గ్రేటర్ పరిధిలో తమ ఉనికిని కాపాడుకోవడానికి, ప్రజల దృష్టిని మళ్లించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ఇటువంటి హడావుడి ప్రకటనలు మరియు నాటకాలకు స్వస్తి పలకాలని హితవు పలికారు.

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ సర్కార్ కుట్రలు చేస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. గతంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులోనే పూర్తిగా విఫలమైన కాంగ్రెస్, ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల పేరిట లబ్ధిదారులలో గందరగోళం సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో అర్హులైన పేదలకు న్యాయం చేయకుండా, కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకే లబ్ధి చేకూర్చేలా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఉచితంగా కట్టిస్తామని చెప్పిన ఇళ్లకు ఇప్పుడు ప్రజల నుండి డబ్బులు దండుకోవాలని చూడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

ప్రజాధనాన్ని వృథా చేస్తూ, అబద్ధపు ప్రచారాలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని గ్రేటర్ ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని ఆయన తెలిపారు. రాబోయే +ఎవీజ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమని హెచ్చరించారు. పేదల ఇళ్ల నిర్మాణ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన విధివిధానాలను ప్రకటించాలని, మాట తప్పకుండా

# నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిలిచిన సీటీ స్కాన్ సేవలు

# మానవ హక్కుల కమిషన్ సంచలన ఉత్తర్వులు

**- ఏడాదిగా యంత్రం పనిచేయకపోవడంపై ఆమ్ ఆద్మీ పార్టీ ఫిర్యాదుతో స్పందించిన కమిషన్**
**- ఆరోగ్య హక్కు ప్రాథమిక హక్కు.. తక్షణమే చర్యలు తీసుకోవాలని హెచ్.ఆర్.సి ఆదేశం**




నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో (జిజిహెచ్) గత ఒక సంవత్సరానికి పైగా సీటీ స్కాన్ యంత్రం పనిచేయకపోవడంపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టిజి.హెచ్.ఆర్.సి) అత్యంత తీవ్రంగా స్పందించింది. ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా నాయకత్వం దాఖలు చేసిన ఫిర్యాదును స్వీకరించిన హెచ్.ఆర్.సి చైర్‌పర్సన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ తక్షణమే స్పందించి, బాధిత రోగుల సౌకర్యార్థం ఉచిత సీటీ స్కాన్ సేవలను పునరుద్ధరించేలా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శికి సిఫార్సు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**ఆరోగ్య హక్కు రాజ్యాంగబద్ధమైన ప్రాథమిక హక్కు:**
ఈ ఉత్తర్వుల వివరాలను ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ సయ్యద్ హైదర్ విలేకరులకు వెల్లడించారు. జిల్లా ఆసుపత్రికి నిత్యం వందలాది మంది నిరుపేద రోగులు వస్తుంటారని, కీలకమైన సీటీ స్కాన్ యంత్రం ఏడాదిగా నిరుపయోగంగా మారడం వల్ల పేద ప్రజలు ప్రైవేట్ కేంద్రాలలో వేల రూపాయలు ఖర్చు చేస్తూ తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. మానవ హక్కుల కమిషన్ తన ఉత్తర్వుల్లో భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం జీవించే హక్కులో 'ఆరోగ్య హక్కు' అంతర్భాగమని స్పష్టం చేసిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా రోగ నిర్ధారణ సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని గుర్తు చేస్తూ, సేవలను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించిందన్నారు.

# రాష్ట్ర స్థాయిలో నిర్మల్ జిల్లా పోలీసు శునక దళానికి అరుదైన గుర్తింపు

**- తొలి అర్ధవార్షిక సేవా నివేదికలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన యామి, జెస్సీ, బోల్ట్ శునకాలు**
**- డాగ్ హ్యాండ్లర్లను ప్రశంసాపత్రాలతో ప్రత్యేకంగా అభినందించిన ఎస్పీ జానకి షర్మిల**



నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ పోలీసు ఇంటెలిజెన్స్ విభాగం అధికారికంగా విడుదల చేసిన తొలి అర్ధవార్షిక సేవా నివేదికలో (జనవరి-- జూన్) నిర్మల్ జిల్లా పోలీసు శునక దళం (డాగ్ స్క్వాడ్) అత్యుత్తమ పనితీరును కనబరిచి రాష్ట్ర స్థాయిలో అరుదైన ప్రశంసలు దక్కించుకుంది. నిర్మల్ జిల్లా పరిధిలో నమోదైన వివిధ రకాల హత్యలు, అనుమానాస్పద మృతులు, భారీ దొంగతనాలు, ఆలయ చోరీలు, మాదకద్రవ్యాల కేసులతో పాటు పలు సంచలనాత్మక కేసుల్లో జిల్లా పోలీసు శునకాలు యామి, జెస్సీ, బోల్ట్ సంఘటన స్థలాల్లో కీలక ఆధారాలను గుర్తించి నిందితుల జాడలను కనిపెట్టడంలో విశేష పాత్ర పోషించినట్లు నివేదికలో పేర్కొన్నారు.

**డాగ్ హ్యాండ్లర్లకు అభినందనలు:**
పోలీసు శునకాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించిన ఏఆర్పీసీ జి. పరమేశ్వర్, కె. శ్రీనివాస్, జి. సాయేందర్ లను జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నేరాల శాస్త్రీయ దర్యాప్తులో శునక దళం అందించే సేవలు అత్యంత అమూల్యమైనవన్నారు. ఇదే నిబద్ధతతో భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలు సాధించి జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐ కృష్ణ, డాగ్ స్క్వాడ్ ఇన్‌ఛార్జ్ ఆర్ఐ శేఖర్ పాల్గొన్నారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు:




ముధోల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): మండల కేంద్రమైన ముధోల్‌లోని వివిధ రకాల వ్యాపార దుకాణాల్లో ఒకసారి మాత్రమే వాడి పారవేసే (సింగిల్ యూజ్) ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిలిపివేయాలని గ్రామపంచాయతీ కార్యనిర్వాహక అధికారి (ఈవో) అన్వర్ అలీ ఆదేశించారు. మంగళవారం ఆయన వ్యాపారులకు ఈ మేరకు అధికారిక హెచ్చరిక నోటీసులు జారీ చేశారు. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనల ప్రకారం ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, నిల్వ, అమ్మకాలు పూర్తిగా నిషేధించబడ్డాయని తెలిపారు. దుకాణదారులు తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి పంచాయతీ వాహనాలకు అందజేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానాలతో పాటు చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈవో హెచ్చరించారు.

# జులై నెలాఖరులోగా రేషన్ కార్డుదారులకు 100% ఈ-కేవైసీ పూర్తి చేయాలి

సారంగాపూర్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): సారంగాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) డీలర్లతో తహసీల్దార్ బి. విజయ్ కాంత్ రావు మంగళవారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లు చౌక ధరల దుకాణాల నిర్వహణలో తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు.

ఈ జులై నెలాఖరు నాటికి తమ పరిధిలోని అన్ని రేషన్ కార్డుదారులకు 100 శాతం ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. లైసెన్స్ రెన్యూవల్ పెండింగ్‌లో ఉన్న డీలర్లు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా బియ్యం పంపిణీ చేయాలని కోరారు. సమావేశంలో గిర్ధవర్ వెంకట నర్సయ్య, డీలర్ల అధ్యక్షుడు నారాయణ రెడ్డి పాల్గొన్నారు.



# కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడికి ఘన సన్మానం



ముధోల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన జంగ్మే సాహెబ్ రావును ముధోల్ మాజీ శాసనసభ్యుడు జి. విఠల్ రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సాహెబ్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కు, జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, డీసీసీ అధ్యక్షుడు వెడ్మ బొజ్జు పటేల్ కు, మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ సన్మాన కార్యక్రమంలో మాజీ ఆత్మ చైర్మన్ పోతరెడ్డి, ఉపసర్పంచ్ చంద్రకాంత్, వార్డు సభ్యులు గంభీర్, ఆనంద్, నాగారావు, అంబదాస్, శంకర్, జనార్ధన్ పాల్గొన్నారు.

# మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన ఎంపీడీవో

ముధోల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రభుత్వ నిబంధనలు, మెనూ ప్రకారం విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని ముధోల్ ఎంపీడీవో లవ కుమార్ గురుకుల సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వడ్డిస్తున్న భోజన నాణ్యతను, బియ్యం నిల్వలను పరిశీలించారు.

వర్షాకాలం సీజన్ అయినందున విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ఉపాధ్యాయులు చూడాలన్నారు. భోజనం చేసేముందు చేతులు శుభ్రంగా కడుక్కునేలా అవగాహన కల్పించాలన్నారు. తాగునీటి శుద్ధిని పరిశీలించిన ఎంపీడీవో, స్టోర్ రూమ్ లోని నిల్వలను ఆరా తీశారు. తనిఖీలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ హామీల అమలుపై సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా:

**- రాజకీయ లబ్ధి కోసమే విమర్శలు.. విద్యార్థుల ఫీజుల బకాయిలపై సమాధానం చెప్పలేకే దాటవేత**
**- నియోజకవర్గ అభివృద్ధిపై ఏ వేదికపైనా అయినా బహిరంగ చర్చకు సిద్ధమన్న ఎమ్మెల్యే**



ఆర్మూర్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన వివిధ రకాల ఆరు గ్యారంటీల హామీల అమలు తీరుపై, అలాగే తాను నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సిట్టింగ్ జడ్జితో పూర్తి విచారణ జరిపించాలని ఆర్మూర్ శాసనసభ్యులు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సంచలన డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు, మహిళల హక్కుల కొరకు తాను మాట్లాడిన మాటలకు ఇప్పటికీ కట్టుబడి ఉన్నానని స్పష్టం చేశారు. నాయకులు కేవలం తమ రాజకీయ పబ్బం గడుపుకోవడానికి మాత్రమే మాట్లాడుతున్నారని, దమ్ముంటే ప్రజా సమస్యలపై తనతో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

**ఏసీబీ విచారణ జరిపితే దొంగలు ఎవరో తెలుస్తుంది:**
రాష్ట్రంలో సిట్టింగ్ జడ్జి లేదా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ద్వారా పారదర్శకంగా విచారణ జరిపిస్తే ఎవరు తప్పు చేశారో, ఎవరు దొంగలో స్పష్టంగా బయటపడుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించమంటే సాకులు చెబుతూ కాంగ్రెస్ నేతలు కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలమైందన్నారు. తనకు ఎవరిపైనా వ్యక్తిగతంగా పగ ప్రతీకారాలు లేవని, అయితే అభివృద్ధి, ప్రజా సమస్యల అంశాలపై ఎక్కడికైనా చర్చకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి స్పష్టం చేశారు.

# విద్యార్థి పోరాటాలపై అణచివేత చర్యలు దారుణం:

**- శాంతియుత నిరసనలపై లాఠీఛార్జ్ చేయడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే**
**- ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలి**



నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): దేశంలో ప్రశ్నాపత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గత 22 రోజులుగా శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, యువతపై పోలీసులు బలప్రయోగానికి పాల్పడటం, లాఠీఛార్జ్ చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిర్మల్ జిల్లా అధ్యక్షుడు అడ్వకేట్ జగన్ మోహన్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ, ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా తమ నిరసన తెలిపే రాజ్యాంగ హక్కును కాలరాయడం కేంద్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు:**
పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది నిరుపేద విద్యార్థుల భవిష్యత్తు పూర్తిగా ప్రశ్నార్థకంగా మారిందన్నారు. బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోకుండా, నిరసన తెలుపుతున్న అభాగ్య విద్యార్థులను అణచివేయాలని చూడటం దారుణమన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. తక్షణమే ఆందోళనకారులపై నమోదైన కేసులను ఎత్తివేసి, లీకేజీ ప్రక్రియపై నిష్పాక్షిక విచారణ జరిపించి బాధ్యులను శిక్షించాలని, విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

# కాంగ్రెస్ జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా కాల్వ సర్పంచ్ రోజా నియామకం



దిలావర్‌పూర్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) ఎస్సీ సెల్ నిర్మల్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ అధికారిక ఉత్తర్వులతో దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామ సర్పంచ్ రోజా జిల్లా ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. మంగళవారం పార్టీ అధిష్టానం ఆమెకు నియామక పత్రాలను అందజేసింది. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. నిర్మల్ జిల్లా పరిధిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు, ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలోని ప్రతి పేద పౌరుడికి అందేలా పార్టీకి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఎస్సీ వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధి కొరకు గ్రామ, జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తానన్నారు. ఆమె నియామకం పట్ల కాల్వ గ్రామ ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

# మారుమూల గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి



కుంటాల, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): మారుమూల గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.

మంగళవారం కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో ఆయన పర్యటించి, తాగునీటి సరఫరా, విద్యుత్, టెలికాం సేవలు, ఇతర మౌలిక సదుపాయాలపై స్థానిక గ్రామస్తులతో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు గ్రామపంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపితే వెంటనే నూతన బోరుబావి మంజూరు చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్‌లు అత్యంత ఉపయోగకరమని పేర్కొంటూ ప్రతి రైతు తన క్షేత్రంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలని కోరారు. పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఈఈ సందీప్, తహసీల్దార్ కమల్ సింగ్ పాల్గొన్నారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం యూనిట్ అధ్యక్షుడిగా డాక్టర్ సూర్య సాగర్



నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ ప్రభుత్వ కళాశాల గెజిటెడ్ అధ్యాపక సంఘం (టిజిసిజిటిఎ) నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల యూనిట్ నూతన అధ్యక్షుడిగా డాక్టర్ కె. సూర్య సాగర్, కార్యదర్శిగా కుంట శ్రీహరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం కళాశాల ప్రాంగణంలో ఎన్నికల అధికారి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు. గంగాధర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు.

నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్, టీజీఓల అధ్యక్షుడు డాక్టర్ పి.జి. రెడ్డి పూలమాలలతో ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె. రమేష్ రెడ్డి, జి. సుభాష్, జి. అర్చన పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి



నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) డిజిటలైజేషన్ ప్రక్రియలో మరింత వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నుండి వివిధ జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని చెప్పారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛికం మాత్రమే అని, అది తప్పనిసరి కాదని ఈ సందర్భంగా సీఈఓ స్పష్టం చేశారు. ప్రక్రియ పూర్తయ్యే వరకు కలెక్టర్లు పూర్తి పర్యవేక్షణ ఉంచాలన్నారు. నిర్మల్ జిల్లా కలెక్టరేట్ నుండి పాల్గొన్న కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేస్తామన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్ఓ రాథోడ్ రమేష్ పాల్గొన్నారు.

# మున్సిపాలిటీలలో పారిశుధ్య పనులకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి




నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): జిల్లాలోని అన్ని మున్సిపాలిటీ పరిధులలో నిరంతరం పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధ్యాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ పారిశుధ్యం, అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా వీధుల్లో నీరు నిలవకుండా చూస్తూ ప్రజలకు ఎలాంటి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సమీక్షలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్లు రవి బాబు, సుందర్ సింగ్, యాదయ్య పాల్గొన్నారు.

# తెలంగాణ జలసిరితో భూగర్భ జలాల పరిరక్షణ: ముథోల్ ఎంపీడీవో లవ్ కుమార్




ముథోల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన తెలంగాణ జలసిరి కార్యక్రమంలో భాగంగా ముథోల్ మండలంలోని బోరేగాం, చించాల, కారేగాం, గనోరా గ్రామాల్లో భూగర్భ జలాల పెంపుపై రైతులకు ప్రత్యేక అవగాహన సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో లవ్ కుమార్ తెలిపారు. వర్షపు నీటి నిల్వ, నీటి వనరుల అభివృద్ధి కొరకు రైతుల క్షేత్రాల్లో ఫామ్ పాండ్లు, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలకు అర్హులైన రైతులను గుర్తించినట్లు చెప్పారు.

గ్రామాల్లో కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మాణాలకు అనువైన స్థలాలను సర్పంచ్‌లతో కలిసి పరిశీలించామన్నారు. రైతులు జలసిరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సభల్లో ఎంపీఓ శివకుమార్, ఏఓ రచన, ఏపీఓ శిరీష్, సర్పంచులు కల్లెడ కిష్టయ్య, సర్వేష్, మేత్రి నారాయణ పాల్గొన్నారు.

# విధులపై స్పష్టత ఇచ్చి రూ.30 వేల వేతనం ఇవ్వాలి




నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): తెలంగాణ రాష్ట్ర లైసెన్స్‌డ్ సర్వేయర్ల సంఘం పిలుపుమేరకు హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వద్ద మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తమ విధులకు సంబంధించి స్పష్టమైన విధివిధానాలు (ఎస్ఓపీ) ఖరారు చేయడంతో పాటు నెలకు కనీసం 30 వేల రూపాయల వేతనం అందించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సర్వేయర్లు ప్రజాభవన్ ను ముట్టడించారు.

శిక్షణ పూర్తి చేసుకుని లైసెన్సులు పొందినప్పటికీ సరైన మార్గదర్శకాలు రాకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నిరసనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళన కార్యక్రమంలో నిర్మల్ జిల్లా లైసెన్స్‌డ్ సర్వేయర్ల అధ్యక్షుడు ఉదయ్ రెడ్డితో పాటు నాయకులు సరిల్, అరవింద్, సచిన్, రాకేష్, కరణ్, భీమేష్, కోడె నరేష్ పాల్గొని తమ హక్కుల సాధన కొరకు నినాదాలు చేశారు.

# బుధవారం భైంసా క్యాంప్ ఆఫీస్ లో ప్రజలకు అందుబాటులో ఎస్పీ జానకి షర్మిల



భైంసా, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): భైంసా డివిజన్ పరిధిలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల బుధవారం భైంసా పట్టణంలో పర్యటించనున్నారు. జూలై 22వ తేదీ (బుధవారం) ఉదయం భైంసాలోని పోలీసు క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ స్వయంగా అందుబాటులో ఉండి ప్రజల నుండి వినతులు, ఫిర్యాదులను స్వీకరిస్తారని పోలీసు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డివిజన్ ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# ముథోల్ లో శ్రీ కృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఊరు పండుగ



ముథోల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): మండల కేంద్రమైన ముథోల్‌లో శ్రీ కృష్ణ యాదవ్ సంఘం ఆధ్వర్యంలో గ్రామదేవతల 'ఊరు పండుగ'ను మంగళవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు కొత్త కుండల్లో నైవేద్యాలు సిద్ధం చేసుకుని మంగళహారతులు పట్టుకుని డప్పు వాయిద్యాల నడుమ మహాలక్ష్మి, దగ్గులవ్వ, ముత్యాలమ్మ ఆలయాలకు శోభాయాత్రగా తరలివెళ్లారు.

ఆలయాల్లో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేసి, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో శ్రీ కృష్ణ యాదవ్ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# దుకాణాలు, హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు



నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): వర్షాకాలం సీజన్ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశాల మేరకు నిర్మల్ పట్టణంలో ఫుడ్ సేఫ్టీ, మున్సిపల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. పట్టణంలోని పండ్ల దుకాణాలు, హోటళ్లు, స్వీట్ హోమ్స్ మరియు టీ కొట్ల వద్ద ఆహార పదార్థాల నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించి యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా వ్యాపారులు తప్పనిసరిగా సానిటరీ నిబంధనలు పాటిస్తూ ఆహారాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, వ్యాపార నిర్వహణకు ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. తనిఖీలలో ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత, సానిటరీ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్ మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పోయిన 6 మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన ఆర్మూర్ పోలీసులు



ఆర్మూర్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఆరు విలువైన మొబైల్ ఫోన్లను పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో రికవరీ చేసి బాధితులకు అందజేశారు. మంగళవారం ఆర్మూర్ పోలీసు స్టేషన్ లో పట్టణ ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణ గౌడ్ బాధితులైన మన్నె విశాల్, మహమ్మద్ అఫ్రోజ్, ఎట్లా చింతామణి, కొండూరు మధుసూదన్, నవీన్ లను పిలిపించి ఫోన్లను హ్యాండోవర్ చేశారు.

ఇందులో మూడేళ్ల క్రితం పోయిన ఫోన్లతో పాటు, ఆరు నెలల వ్యవధిలో పోయిన మొబైల్స్ ఉన్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్ లో ఫిర్యాదు నమోదు చేయాలని ఆయన సూచించారు.

# గాజులపేట్ లో వర్ష బాధితుల రహదారులను పరిశీలించిన వైస్ చైర్మన్ అప్పాల గణేష్

.నిర్మల్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని గాజులపేట్ (వార్డు నెంబర్ 21) పరిధిలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి మంగళవారం పర్యటించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కాలనీ వీధుల్లో నిలిచిన నీటిని, దెబ్బతిన్న రహదారులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వర్షాకాలంలో ప్రజల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే రహదారుల మరమ్మతు పనులు చేపడతామని తెలిపారు.

అలాగే మున్సిపల్ వైస్ చైర్మన్ ను మహాలక్ష్మి ఆలయ నూతన కమిటీ సభ్యులు, టీజీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించి తమ భవన విస్తరణకు సహకరించాలని విన్నవించారు. పర్యటనలో కౌన్సిలర్లు ఇర్ఫాన్, పెండం శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ కాళ్ల రాజు పాల్గొన్నారు.



# ప్రాథమిక స్థాయి ఎస్జీటీ ఉపాధ్యాయులకు వినూత్న బోధనా శిక్షణ

ఆర్మూర్, జూలై 21 (తెలంగాణ వెన్నెల వాక్కు): తరగతి గదుల్లో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా వినూత్న బోధనా పద్ధతులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల విద్యాధికారి (ఎంఈఓ) సూచించారు. ఆర్మూర్ లో ప్రాథమిక స్థాయి ఎస్జీటీ ఉపాధ్యాయులకు ఈ విద్యా సంవత్సరంలో కనీస అభ్యసన సామర్థ్యాల సాధన కొరకు ఇంగ్లీష్, గణితం, తెలుగు సబ్జెక్టులలో బోధనా మెలకువలపై ప్రత్యేక శిక్షణా తరగతులను నిర్వహించారు.

విద్యార్థుల్లో సబ్జెక్టు పట్ల ఆసక్తి పెంచేలా బోధన ఉండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో విద్యా విషయిక రిసోర్స్ పర్సన్స్ గా స్వరూప, దివ్య, మధులత, రజిత వ్యవహరించి ఉపాధ్యాయులకు పలు బోధనా మెలకువలను ప్రాక్టికల్ గా వివరించారు.

OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com